సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 25 । మే । 2024



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు - 8లో▸

కాజీపేట జంక్షన్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్ తెలిపారు.



కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్ - 8లో▸

కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని మంత్రి సీతక్క అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0^{0} / 28.0^{0}

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం తెలిపారు. మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 279 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ పరీక్షకు 22 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్..

జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా నిర్వహించినట్లు పరీక్ష కన్వీనర్ డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష నిర్వహించగా 963 మంది విద్యార్థులకు గాను 78 మంది గైర్హాజరు కాగా 885 మంది ప్రవేశ పరీక్ష రాసినట్లు కన్వీనర్ తెలిపారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్



భూపాలపల్లి అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో శుక్రవారం జడ్జి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఇరువర్గాలు లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, నారాయణ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు బోనస్ చెల్లించాలని ధర్నా



వాజేడు: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని కోరుతూ సీపీఎం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దులాపురం అటవీ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కుర్సం ప్రవీణ్ మాట్లాడుతూ అష్టకష్టాలు పడి తునికాకు సేకరణ చేస్తే అందుకు సంబంధించిన బోనస్ డబ్బులను రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చి వాజేడు, వెంకటాపురం(కె) మండలాల లబ్దిదారులకు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. బోనస్ డబ్బులు విడుదలై సంవత్సరమైనా ఇంతవరకు ఇవ్వక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. 2016 నుంచి 2020 వరకు పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇచ్చారు. బోనస్ డబ్బులను వెంటనే ఇవ్వక పోతే అటవీ శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దామోదర్, కృష్ణ బాబు, తదితరులున్నారు.

వెబ్‌సైట్‌లో పోలింగ్ కేంద్రం వివరాలు



కాశోజీ సెంటర్ : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక కోసం ఓటు హక్కు నమోదు చేసుకున్న వారు ఈసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు అందించామని పేర్కొన్నారు. స్లిప్పులు అందని పట్టభద్రులు http:// ceotelangana.nic.inలో చూసుకోవచ్చని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ఓటు హక్కుతో పాటు పోలింగ్ కేంద్రం తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.

నేటితో ప్రచారానికి తెర..

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం సాయంత్రం 4 గంటలకు తెర పడనుందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఈసీ నిబంధనల మేరకు చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సైలెన్స్ పీరియడ్‌లో ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపకూడదని కలెక్టర్ సూచించారు.

'బెల్టు' జోరు..

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఊపందుకున్న మద్యం అమ్మకాలు

- పెద్దఎత్తున పెరిగిన కొనుగోళ్లు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ





కాళేశ్వరం: లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో గ్రామాల్లో బెల్టుషాపులు మళ్లీ ఓపెన్ అయ్యాయి. మద్యం దుకాణాల్లాగా గల్లీల్లో అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా బెల్ట్ దుకాణాలను మూసివేశారు. మద్యం అమ్మకాలపై నిఘా ఉంచుతూ.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడితే బెల్ట్ తీశారు. దీంతో గ్రామాల్లో మద్యం అమ్మకాలు తగ్గిపోయాయి. చాలా ఇళ్లలో ప్రశాంత వాతావరణం నెలకొనగా ప్రస్తుతం మళ్లీ మునపటి పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 11 మండలాల్లో 60 వరకు మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో బెల్టు షాపులు తెలిసినవి 600 వరకు.. తెలియనివి 300 వరకు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలక్షన్ అధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ బెల్టు దుకాణాలను మూసివేసింది. అక్కడక్కడ మద్యం అమ్మకాలు జరిగిన సమయంలో... సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు దాడులు చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. దీనిపై పౌరులకు అవగాహన కల్పిస్తూ... సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి మూసి ఉన్న బెల్టు దుకాణాలు.. కౌంటింగ్ ముగిసిపోవడంతో బార్లను తలపించే విధంగా తెరుచుకోగా, మళ్లీ పార్లమెంట్ ఎన్నికల ముందు మూసివేశారు. ఇప్పుడు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు మళ్లీ తెరుచుకున్నాయి.



మహారాష్ట్రకు మన మద్యం..

కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని మహదేవపూర్, కాళేశ్వరం మద్యం దుకాణాల్లో మద్యాన్ని గోదావరి దాటించి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అక్కడ ఆదివాసీ జిల్లా కనుక మద్యం అమ్మకాలు లేవు. దీంతో మద్యం దుకాణాల నిర్వాహకులు బెల్టు దుకాణాలకు విక్రయించే మద్యం రూ. 20–30 అదనంగా తీసుకుంటున్నట్లు తెలిసింది. బెల్టు దుకాణాల వారిని ఆపేవారుండరు. తనిఖీలు చేసేవారుండరని చర్చ ఉంది. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీరిని మద్యం దుకాణదారులు ప్రోత్సహిస్తున్నారని తెలిసింది. మహదేవపూర్, కాళేశ్వరం మద్యం దుకాణాల పరిధిలో సుమారుగా 200 వరకు బెల్టు దుకాణాలు ఉన్నాయి.

నిత్యం వేలల్లో తరలింపు..

బెల్ట్ నిర్వాహకులు రోజువారీగా రూ.వేలల్లో సరుకు తీసుకువెళుతున్నారు. ఎన్నికల సమయంలో పల్లెల్లో మద్యం దుకాణాల మూసివేతతో మందుకు బానిసగా మారిన వందలాది మంది ఉదయం పూట చుక్క వేయడం మానేశారు. దీంతో ఆ కుటుంబాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది. గొడవలు, పంచాయతీలకు చెక్ పడింది. ప్రస్తుతం మద్యం ఏరులై పారుతుండడంతో మళ్లీ మునుపటి రోజులు పునరావృతం కానున్నాయి. కేవలం ఎన్నికల సమయం అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల సమయంలోనే బెల్ట్ దుకాణాలను మూసివేస్తూ.. మిగతా సమయంలో గాలికి వదిలేస్తున్నారు. దీంతో అధికారికంగా వాటికి అనుమతి ఇస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయి. రోజువారి కూలీ పనిచేస్తూ, వచ్చే సంపాదన మద్యానికే తగలేస్తుండడంతో.. అనేక కుటుంబాలు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేకంగా ఎక్సైజ్‌శాఖ ఉన్నప్పటికీ, పర్యవేక్షణ లోపం కనిపిస్తుంది. బెల్టు దుకాణాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

పెరిగిన కొనుగోళ్లు..

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు తెరుచుకోవడంతో జిల్లాలో చాలా చోట్ల బెల్టు దుకాణాలు బార్లు, రెస్టారెంట్లను తలపించే విధంగా ఉన్నాయి. కొన్నిచోట్ల బ్లాక్ డాగ్, బ్లెండర్ ప్రైడ్ ఇలా ఖరీదైన ఫుల్, ఆఫ్, క్వార్టర్ బాటిల్స్, కింగ్‌ఫిషర్ బీర్లు సైతం దొరికే పరిస్థితి ఉంది. క్వార్టర్, ఆఫ్, ఫుల్లు రూ.20 నుంచి రూ.100 వరకు అదనపు ధరలతో మద్యం ప్రియుల జేబులు ఖాళీ చేస్తున్నారు. మద్యానికి బానిసలుగా మారిన కొంతమంది రాత్రి, పగలు అనే తేడా లేకుండా 24 గంటలు బెల్ట్ దుకాణానికి వెళ్తూ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారు.

ఆస్పత్రులకు నిరంతర విద్యుత్ సరఫరా



జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ బి.మల్చూర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ప్రధాన 100 పడకల ఏరియా ఆస్పత్రి, వైద్య కళాశాలను సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్‌తో సమావేశమై విద్యుత్ సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రులకు ఎటువంటి పరిస్థితుల్లో కూడా అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డివిజనల్ ఇంజనీర్ డి.నాగరాజు, ఏడీఈ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా..

జిల్లావ్యాప్తంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా నోడల్ ఆఫీసర్ టి.మధుసూదన్ సీజీఎం అధికారులకు సూచించారు. శుక్రవారం రేగొండ మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను టి.మధుసూదన్ తనిఖీ చేశారు. సరఫరాలోని అంతరాయాలను భవిష్యత్‌లో వాటిని తగ్గించడానికి ప్రయత్నించాలన్నారు. సబ్‌స్టేషన్‌లోని పాత బ్రేకర్ల స్థానంలో కొత్త వాటికి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ లైన్లను షెడ్యూల్ ప్రకారం మెయింటెన్ చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కార్యాలయంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వ్యవసాయ కనెక్షన్లను త్వరితగతిన రిలీజ్ చేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ సమస్య రాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ మల్చూర్‌నాయక్, డివిజనల్ ఇంజనీర్ నాగరాజు, భూపాలపల్లి జిల్లా ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

96మంది పోస్టల్ బ్యాలెట్..



పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లకు పరిశీలిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: ఖమ్మం–వరంగల్–నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించబడిన 96మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన 97మంది సిబ్బంది ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయగా.. 97మందికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేశామన్నారు. 97మందికి ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించామని శుక్రవారం వరకు 96 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తదుపరి పోస్టల్ బ్యాలెట్‌ను అత్యంత భద్రత మధ్య గోదాములో భద్రపరిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డీపీఓ నారాయణరావు పాల్గొన్నారు.

గ్రూప్ పరీక్షలకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

భూపాలపల్లి అర్బన్: జూన్ 9వ తేదీన నిర్వహించే గ్రూప్–1 పరీక్షకు జిల్లాకేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 90306 32608 ఫోన్‌నంబర్ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎవైనా సందేహాలు, ఇబ్బందులు ఉన్నట్లయితే హెల్ప్‌డెస్క్ నంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



లాగ్‌బుక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

రేగొండ(కొత్తపల్లిగోరి): విద్యుత్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా పనిచేస్తే చర్యలు తప్పవని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. కొత్తపల్లిగోరి, రేగొండ సబ్ స్టేషన్లను ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లో ఉన్న లాగ్ బుక్స్‌ను తనిఖీ చేయగా.. రేగొండ సబ్ స్టేషన్‌లోని లాగ్ బుక్‌లో వైట్నర్ పెట్టి ఉండటంతో ఏఈ, ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పొనగండ్ల గ్రామానికి చెందిన రైతుల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం సబ్‌స్టేషన్‌కు తీసుకురాగా.. ఆరు నెలల నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఈని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానమిచ్చారు. కొత్తపల్లిగోరి సబ్‌స్టేషన్‌లోని కోనరావుపేట ఫీడర్‌లో సుమారు 11 గంటలపాటు కరెంట్ సరఫరా నిలుపుదల చేయడంతో లైన్‌మెన్, ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా పనిచేస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వం నిరంతర విద్యుత్‌ను అందిస్తుంటే గంటల తరబడి విద్యుత్ నిలుపుదల ఏంటని ఏఈ కనకయ్యను ప్రశ్నించారు. సమాచారం లేకుండా గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలపడం సరికాదన్నారు. మరోసారి విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు కిష్టయ్య, ఉమేష్‌గౌడ్, పున్నం రవి, ఓం ప్రకాశ్, భిక్షపతి, మధుసూదన్, సుదర్శన్, రామరావు, ప్రేమాజీ, వీరబ్రహ్మం ఉన్నారు.



వైట్నర్‌తో దిద్దిన లాగ్‌బుక్

ఏజెన్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి

వెంకటాపురం(కె): రాష్ట్ర గెజిట్ ప్రకారమే ఏజెన్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు దొడ్డిదారిన బయటకు వస్తున్నాయని, ప్రతీ దరఖాస్తు దారుడికి ఎస్టీ కేటగిరి, ఇంటి పేరు వంశ వృక్షం పై పూర్తి విచారణ జరపాలన్నారు. అధికారులు విచారణ చేసి బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోదబోయిన సురేష్, పద్దం సుధాకర్, ఎట్టి చంద్రశేఖర్, అనిల్, అరుణ్ ఉన్నారు.

ప్రతీ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలలలో కొనసాగుతున్న పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 420 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం సమయానికి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈఓ రాంకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యటన ఉద్యోగ జీవితానికి ఉపయోగకరం

గ్రామస్థాయి పర్యటన ఉద్యోగ జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. జిల్లాలో ఐదు రోజుల పర్యటకు విచ్చేసిన కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందంతో ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలున్న జిల్లాలో పర్యటించి ప్రజల జీవన స్థితిగతులు, ఆర్థిక అంశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడం చాలా సంతోషమని అన్నారు. ఐదు రోజుల పర్యటన తమకు సంతృప్తిని ఇచ్చిందని, అసిస్టెంట్ సెక్షన్ అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో డీపీఓ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

భూపాలపల్లి అర్బన్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ భవేష్‌మిశ్రా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల బంధువులతో వైద్యసేవలు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ప్రజల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా విధులు నుంచి తొలగించాలని సూపరింటెండెట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.



రోగి బంధువుతో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులను అభినందించిన కలెక్టర్


జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులను కలెక్టర్ భవేష్‌మిశ్రా అభినందించి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఉత్తమ విద్యార్థులైన ఊరుగొండ సాహిత్య (జెడ్పీహెచ్ పెద్దాపూర్), కొత్తూరి అంజన (కేజీబీవీ చిట్యాల), గంధం అక్షయ, ముత్యాల అభినయ (మహాత్మా జ్యోతి బాపూలే బీసీ రెసిడెన్షియల్ గాంధీనగర్)లకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం టాబ్స్ పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈఓ రాంకుమార్, కిషన్‌రావు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం


కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను కలెక్టర్ భవేష్‌మిశ్రా ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, సిబ్బంది సౌకర్యార్థం తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు.

ఘనంగా హేమాచలుడి రథోత్సవం

- దైత అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం
- గ్రామంలో పండుగ వాతావరణం
- అలరించిన కళాకారుల నృత్యాలు



ఊరేగింపులో రథాన్ని లాగుతున్న గ్రామస్తులు



రథంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

మంగపేట: మండలంలోని మల్లూరులో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు రథోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. మల్లూరుగుట్టపై గల శ్రీ హేమాచల క్షేత్రంలో నెల 19 నుంచి జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు (జాతర) కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వాహణ అధికారి పర్యవేక్షణలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, శిష్య బృందం ఆలయ అర్చకులు ఉదయం ఆలయంలో స్వామివారికి నిత్య పూజ, సేవా కాలం, బాలబోగం సంక్షిప్త రామాయణ హవనం, పూర్ణాహుతి, మమానివేదన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలకు ముందుగా ఆలయ ప్రాంగణంలోని దైత(వనదేవత) అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిరుమంజనం, శ్రీ లక్ష్మీసహస్రనామ స్తోత్ర పారాయణ, హవనం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి (సేవపై)లో మంగళవాయిద్యాల నడుమ గుట్టపై నుంచి మల్లూరు గ్రామానికి చేర్చారు. రాత్రి 8 గంటల నుంచి గ్రామంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి పురవీధుల్లో మేళతాలాల నడుమ టపాసులు పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జంటగా గ్రామానికి వచ్చిన దేవతామూర్తులకు మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి మంగళహారతులతో ఎదురేగి దర్శించుకున్నారు. బిందెలతో నీల్లారబోసి టెంకాలు కొట్టి పాడిపంట సంవృద్ధిగా పండాలని తమ పిల్లాపాపలు చల్లంగా ఉండేలా చూడాలని కోరుకున్నారు.

ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు

ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ద్రాక్షారామం నుంచి వచ్చిన కళాకారుల బృందం వివిధ రూపాల వేశాధారణతో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలి

హేమాచల క్షేత్రంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

మంగపేట: హేమాచల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరంలో మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లూరు శ్రీ హేమాచలక్షేత్రంలోని లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందచేశారు. అనంతరం విధుల్లో భాగంగా జాతరలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి ఇప్పటివరకు ఎంత మంది భక్తులకు వైద్య సేవలు అందించారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంగపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఆదేశించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

జిల్లా వైద్యాధికారి అప్పయ్య పెళ్లిరోజు సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులను పలకరించి వారి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పయ్యను వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కొమరగిరి సాంమ్రాజ్యం, కేశరావు దంపతులు శాలువాతో సత్కరించారు.



హేమాచలుడిని దర్శించుకుంటున్న డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల సీసీఎస్ రుణాల పెంపు

కాజీపేట రూరల్: రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (లిమిటెడ్) సీసీఎస్ (రైల్వే ఉద్యోగులు) సభ్యుల రుణాలు పెంచుతూ డైరెక్టర్ల మీటింగ్‌లో తీర్మానించినట్లు కాజీపేట రైల్వే సీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్, కాజీపేట రైల్వే సీసీఎస్ కో ఆప్షన్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. సికింద్రాబాద్ సీసీఎస్ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీసీఎస్ డైరెక్టర్ల బోర్డు మీటింగ్‌లో రుణాలను పెంచుతూ కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాజీపేట నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, రాఘవేందర్ ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. సీసీఎస్ సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న జనరల్ లోన్ రుణం రూ.3లక్షలను రూ.4లక్షల వరకు, స్పెషల్ లోన్ రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. పెంచిన రుణాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, రుణాల వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో ఘటన
- ఏడాదిక్రితం ప్రేమవివాహం చేసుకున్న జంట


నితిన్ మృతదేహం

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని ఒకటో డివిజన్ పలివేల్పుల ఆనంద్‌నగర్ కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివేల్పులకు చెందిన గోలి నితిన్(25) నర్సంపేటకు చెందిన ఓ యువతి ప్రేమించుకుని ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొంత కాలం సవ్యంగానే సాగినా.. అనంతరం గొడవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల భర్తతో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన నితిన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.



అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

- కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు తనిఖీ చేసిన డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రారంభించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం అభివృద్ధి పనులు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భర్తీష్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన వరల్డ్‌క్లాస్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్ స్కీం అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్‌ఎం తనిఖీ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే వెయిటింగ్ హాల్స్, టాయ్‌లెట్స్, విశ్రాంతి గదులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జితోపాటు జంక్షన్ ఎదుట ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేసి పనుల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలపై అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్న కార్యాలయాలు, నూతన నిర్మాణాలను పరిశీలించి పలు చోట్ల మార్పులు, చేర్పులపై, వర్షం నీరు నిల్వకుండా ఉండేందుకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏడీఆర్‌ఎం గోపాల్, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.


జనగామ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్


కాజీపేట జంక్షన్‌లో అధికారులకు సూచనలిస్తున్న డీఆర్‌ఎం

జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్కీంలో భాగంగా జనగామ రైల్వేస్టేషన్ ఆధునీకీకరణకు సుమారు రూ.107కోట్ల వరకు బడ్జెట్ కేటాయించగా, మొదటి విడత రూ.27 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం డీఆర్‌ఎం భర్తీష్‌కుమార్ జైన్ జనగామ రైల్వేస్టేషన్‌లో పనుల పురోగతిని పరిశీలించారు. లక్ష్యం మేరకు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పార్కింగ్, గ్రీనరీ, తదితర వాటికి సంబంధించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అందుబాటులో నూతన వంగడాలు

హన్మకొండ: రైతులకు అవసరమైన నూతన వంగడాలు అందుబాటులో ఉన్నాయని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తన మేళాలో ఉమారెడ్డి మాట్లాడారు. అధిక దిగుబడులు ఇచ్చే, చీడపురుగులను తట్టుకునే నూతన వరి, కంది, పెసర విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పంటల అవశేషాలు కాలపెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని, పచ్చిరొట్ట పంటలను వేసుకుని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు వి.వెంకన్న, జి.వీరన్న, ఎస్.సంధ్య కిశోర్ మాట్లాడారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. పత్తి పంటలో అధిక సాంద్రత కలిగిన పత్తి ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పంట మార్పిడి విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విస్తీర్ణం పెంచాలని సూచించారు. వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు గుర్తింపు పొందిన డీలర్ వద్దనే తీసుకోవాలని, వాటికి సంబంధించిన రశీదు, ఇతర వివరాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. జీలుగ విత్తనాలు రైతులకు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు అందించి, రైతులకు అవసరమైన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ దిలీప్ కుమార్, వ్యవసాయ శాఖ హనుమకొండ ఏడీ దామోదర్ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఉమారెడ్డి, ఉషాదయాళ్

నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలి

వరంగల్: రైతులు సాగుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ అనుమతిలేని, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్న వ్యాపారులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కలిసి వినతి పత్రాలను అందజేసి, మాట్లాడారు. గత సంవత్సరం విక్రయించగా మిగిలిన బ్రాండెడ్ కంపెనీల విత్తనాలను అదే కంపెనీల పేరుతో ఇప్పుడున్న లాట్ నంబర్ వేస్తూ ప్యాకింగ్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ట్రూతఫుల్ లేబుళ్లను ప్యాకింగ్‌లపై అంటించి అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పైరు ఏపుగా పెరుగుతుందని, దిగుబడి బాగా వస్తుందనే నమ్మించి అనుమతి లేని బయో మందులను సైతం రైతులకు అంటగడుతున్నారని అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పోలీస్ శాఖలోని నిఘా వర్గాలు, వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల హోల్‌సేల్, రిటేల్ దుకాణాల్లో, సరుకులు నిల్వలు ఉండే గోదాముల్లో తనిఖీలు చేపట్టి రైతులు మోసపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సంపత్‌కుమార్, నర్సయ్య, గోపాలరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం

- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్


న్యూరాయపురలో ప్రచారంలో పాల్గొన్న రవీందర్‌సింగ్

హన్మకొండ చౌరస్తా: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రభుత్వాన్ని ప్రశంసించే వ్యక్తిని కాకుండా ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందామని కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రులను కోరారు. హనుమకొండలోని కాకతీయ కాలనీ, కార్పొరేషన్ సర్కిల్, న్యూ రాయపుర ప్రాంతాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గత బీఆర్‌ఎస్ సర్కార్ ఇచ్చిన సంక్షేమ పథకాలను పక్కన పెట్టిందని అన్నారు. తీన్మార్ మల్లన్న.. చోర్ మార్‌గా.. మారి ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుగా మారాడని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, అనిల్, పాషా, చిరంజీవి, జనార్దన్‌గౌడ్, తుల రమేశ్, శీలం ప్రవీణ్, గోపిరెడ్డి రాజు, అనురాం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబమే పెద్ద బ్లాక్‌మెయిలర్

- రాష్ట్ర మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు: కేసీఆర్ కుటుంబం కంటే పెద్ద బ్లాక్‌మెయిలర్ రాష్ట్రంలో ఎవరూలేరని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం ఇంచర్ల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో సీతక్క మాట్లాడారు. తాను ఎక్కడ మోసం చేశానో తనపై ఆరోపణలు చేస్తున్న దుర్మార్గులు, దోపిడీదారులు నిరూపించాలని సవాల్ విసిరారు. ఆదివాసీ మహిళ మంత్రిగా ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి సన్నాలుకు బోనస్ ఇస్తున్నామని, ఇక ముందు దొడ్డురకానికి కూడా ఇస్తామని తెలిపారు. 'పక్కదేశంలో చదువుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గొప్పోడా.. మన మధ్యలో ఉంటూ ప్రజలు, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న గొప్పోడా..' అని సమావేశానికి వచ్చిన పట్టభద్రులను అడిగి సమాధానం రాబట్టారు. మల్లన్నను అర్ధరాత్రి అరెస్ట్ చేసి, కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రశ్నించడం మానుకోలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ప్రతి విషయంలో ప్రశ్నించి అడ్డుతగులుతున్నాడని నన్ను అరెస్ట్ చేయించావు, మరి ఇప్పుడు నీ చెల్లి కవితమ్మ ఎందుకు అరెస్ట్ అయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారో రాకేశ్‌రెడ్డికే తెలియదని, దుర్గమ్మ గుడిచుట్టూ మేకను తిప్పినట్లు అతన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, నాయకులు కూచన రవళి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, రాంరెడ్డి, రవి, వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

రామన్నపేట: గత 40 సంవత్సరాలుగా నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేస్తూ, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేశాయ్‌పేట కేఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎన్నికల ఇన్‌చార్జ్ పీవీఎల్ శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, అల్లం నాగరాజు, కార్పొరేటర్లు కల్పన, స్వాతి, రంజిత్ పాల్గొన్నారు.

ప్రదీప్‌రావు ఇంటికి లక్ష్మణ్

కాశిబుగ్గ: నగర పర్యటనకు వచ్చిన లక్ష్మణ్ ఓ సిటీలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, రేణుక దంపతులు ఆయనకు స్వాగతం పలికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు.

జిల్లాల్లో క్రికెట్ అసోసియేషన్లను సంప్రదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నయీంనగర్: తెలంగాణ జిల్లాలలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌ను సంప్రదించకుండా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధికారులు ఏ చర్యలకు ఉపక్రమించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఝెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి, కోశాధికారి డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ తప్ప ఏనాడు తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేయని హెచ్‌సీఏ ఇప్పుడు జిల్లాల్లో స్టేడియాలను నిర్మాణం చేస్తామనడం బూటకమన్నారు. ఇన్ని సంవత్సరాలు జిల్లాల పేరు చెప్పి బీసీసీఐ నుంచి వందల కోట్ల రూపాయలు తీసుకుని అవినీతికి పాల్పడిన హెచ్‌సీఏ పాలకమండలి బాధ్యత వహిస్తుందా.. అని ప్రశ్నించారు. హెచ్‌సీఏలో గత 5ఏండ్లుగా లెక్కలు, ఫోరెన్సిక్ ఆడిట్ చేయలేదని, రంజీ ట్రోఫీలలో 24వ స్థానానికి పడిపోయిందని తెలిపారు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన హెచ్‌సీఏ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జైపాల్, సమీర్, నవరసం, ఆదిత్య, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తికి కమ్యూనిస్టుల మద్దతా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ


విలేకరులతో మాట్లాడుతున్న రాణి రుద్రమ

హన్మకొండ: యూ ట్యూబ్ చానల్‌ను అడ్డు పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న కమ్యూనిస్టులు ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీనియర్ నాయకుడు రాఘవులు అవినీతికి పాల్పడ్డారని, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వద్ద రూ.100 కోట్లు తీసుకుని 10 టీవీ చానల్‌ను ధారాదత్తం చేశారని తీన్మార్ మల్లన్న యూట్యూబ్ ద్వారా ప్రచారం చేశారని, ఈ ఆరోపణలకు ఆధారాలు చూపించాడా..? లేక తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిల్‌కు భయపడి మద్దతు ఇస్తున్నారా.. అనేది సమాజానికి చెప్పాలన్నారు. బ్లాక్ మెయిల్ చేసి మీ అవినీతి సొమ్ము నుంచి తీసుకున్న మొత్తాన్ని సీఎం రేవంత్‌కు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారా అని ప్రశ్నించారు. తాను కూడా కేటీఆర్ వద్ద డబ్బులు తీసుకుని స్థలం కొన్నానని ఆ చానల్ ద్వారా ప్రచారం, ఆరోపణ చేస్తే ఆధారాలు చూపించాలని, లేకపోతే చెప్పుతో కొడతానని హనుమకొండ చౌరస్తాలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది జరిగి మూడేళ్లయినా ఆధారాలు చూపించలేదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు తాళ్లపల్లి కుమారస్వామి, కొండి జితేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజిరెడ్డి, నర్మెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైంది.. అందుకే చనిపోతున్నా

- కుటుంబ సభ్యులకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య


బాదావత్ నవీన్ మృతదేహం

గూడూరు: 'నాప్రేమ విఫలమైంది. అందుకే చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు తన కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురం భీంనగర్ అటవీప్రాంతంలో శుక్రవారం జరిగింది. పోలీసులకు మృతుడి తండ్రి కీర్యానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన బాదావత్ నవీన్ (25) ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కానీ ఆ యువతి ఇటీవల నవీన్ ప్రేమను కాదంటుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో అతను గురువారం ఉదయం నాజీతండా నుంచి బయలుదేరి గూడూరు మండలం మచ్చెర్ల శివారు కొమురంభీంనగర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. తన ప్రేమ విఫలమైందని, అందుకు తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి చెప్పాడు. ఆ తరువాత పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నాజీతండా నుంచి బయలుదేరి అడవికి చేరుకోగా నవీన్ అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే గూడూరు సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి కీర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ముప్పు

- సామాజిక విశ్లేషకులు భిక్షమయ్య


సదస్సులో మాట్లాడుతున్న బొజ్జ భిక్షమయ్య

నయీంనగర్: మనువాద రాజకీయాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు బొజ్జ భిక్షమయ్య అభిప్రాయపడ్డారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఫోరమ్ కన్వీనర్ ప్రొ.ఎర్రగట్టుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త బొజ్జ భిక్షమయ్య మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి అన్న నినాదమే మోసపూరితమైందన్నారు. బలహీనవర్గాలు, వెనుకబడిన మైనార్టీలకు రిజర్వేషన్లు ఉండకుండా కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభలు 90రోజులు నడవాలని కాని 15రోజులే నడుస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రీతి దయాళ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం రద్దు అయితే దేశంలో ప్రజాస్వామ్యం రద్దు అవుతుందన్నారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చాలనే వాళ్లను ఓడించాలని, ప్రజల గొంతుకగా నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు రామబ్రహ్మం, ప్రొఫెసర్ వీరన్న, ఎండీ.రియాజ్, కత్తి వెంకటస్వామి, బదావత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారు


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గుగులోతు బోజ్యా

సాక్షి, మహబూబాబాద్: పోలీస్ స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలు పెడుతున్నారని మానుకోట జిల్లాలోని కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన గుగులోతు బోజ్యా ఆరోపించాడు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకర్లతో మాట్లాడాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు బస్తాల దొడ్డు బియ్యం విక్రయించడానికి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు తీసుకెళ్తుండగా కొత్తగూడ ఎస్సై గువ్వల బోడు వద్ద పట్టుకుని బండిని సీజ్ చేసి కొట్టాడు. వారం రోజుల తర్వాత పిలిచి మళ్లీ కొట్టాడు. పీడీఎస్ బియ్యం అమ్ముకుంటున్నట్లు కేసు పెట్టి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి మరోసారి బియ్యం విక్రయానికి పాల్పడొద్దని చెప్పి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈరోజు(శుక్రవారం) మళ్లీ మాట్లాడాలని స్టేషన్‌కు పిలిచాడు. భయంతో గ్రామపెద్దలను తీసుకుని వెళ్లాను. పెద్దమనుషులను బయట కూర్చోమని చెప్పి నన్ను ఎస్సై మళ్లీ కొట్టాడు. ఇలా మాటిమాటికి పిలిచి కొడుతున్నాడని బోజ్యా తెలిపారు. ఇదే విషయమై ఎస్సై దిలీప్‌ని వివరణ కోరగా తాను ఎవరిని చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు. బియ్యం ఎక్కడికి తరలిస్తున్నారో తెలుసుకునేందుకు విచారిస్తుండగా తనపై కావాలని ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తేలుకాటుతో బాలుడి మృతి


కిషన్‌సింగ్ మృతదేహం

ఎల్కతుర్తి: ఆరబోసిన ధాన్యంపై కప్పిన పరద తీస్తుండగా ఓ బాలుడికి తేలు కుట్టడంతో మృతిచెందాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఠాగూర్ కిషన్‌సింగ్(13) తన తండ్రి ఠాగూర్ శ్యామ్‌సింగ్‌తో కలిసి గ్రామ శివారులో ఆరబోసిన వరిధాన్యంపై కప్పిన పరదను తీస్తున్న క్రమంలో తేలు కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం 108వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేపట్టాలి

- జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డి, సుభాషిణిని సత్కరిస్తున్న రవి, అమ్జద్

కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయదారులకు సులభతరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా జాయింట్ ఐజీ మధుసూదన్ రెడ్డి రిజిస్ట్రేషన్, చిట్స్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ కార్యాలయంలో జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డి, డీఐజీ సుభాషిణిని జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, సబ్ రిజిస్ట్రార్ అమ్జద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.

విద్యుత్ షాక్‌తో డిగ్రీ విద్యార్థి దుర్మరణం


కరుణాకర్ (ఫైల్)

లింగాలఘణపురం: కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు కూలిపనులకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విషాదకర ఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల ప్రమీల ఆగమల్లయ్య చిన్న కుమారుడు, డిగ్రీ విద్యార్థి గట్టగల్ల కరుణాకర్ (21)భవన నిర్మాణపనులకు కూలీగా వెళ్లాడు. ఈ నేపథ్యంలో మేస్త్రీ గట్టగల్ల నర్సయ్య పటేల్‌గూడెంలో బండ శ్రీశైలం ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా కరుణాకర్ రోజువారీ కూలీగా వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం యథావిధిగా పనికి వెళ్లి సిమెంట్, ఇసుక కలిపేందుకు సంప్‌లో నుంచి నీరు పెట్టేందుకు మోటార్ ఆన్ చేసి, తిరిగి బంద్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.